

# ఏకలవ్యుడు

— ఘండికోట బ్రహ్మాజీరావు

“గురువుగారికి నమస్కా-రాలు!”

శిబో అతని పాదాలు స్పృశించి అన్నాడు.

శిబో పూర్తి పేరు శివకుమార్ ముజుందార్. వాడు నమస్కారం చేసిన అతను శైలేంద్ర మజుందార్-

శైలేంద్ర ఫుట్‌బాల్ ఆటగాళ్లను తయారుచేసే కోచ్. అతను ప్రస్తుతం కలకత్తాలో వుంటున్నాడు. అతనికి బర్నపూరు కార్ఖానావారు ప్రత్యేకంగా ఉద్యోగమిచ్చి, ఉద్యోగులకు, వాళ్ళ పిల్లలకు బంతాట నేర్పిస్తున్నారు- రమారమి పదిహేనేళ్లయి అతను అదే పని చేస్తున్నాడు.

వారం రోజులై అతను కలకత్తాలో బస చేశాడు. 'బర్నపూర్ బ్లూస్' జట్టుకు అతను శిక్షకుడు. వాళ్ళు లీగ్ మాచెస్‌లో పాల్గొంటున్నారు. క్వార్టరు ఫైనల్స్ నుంచి అతని జట్టు మరునాటి మాచ్ గెలిస్తే సెమీ ఫైనల్స్‌కి చేరుకుంటుంది.


వంగ దేశంలో ఫుట్‌బాల్ ఆటకు చాలా ప్రాముఖ్యం వుంది. ప్రతి పల్లెటూరిలోనూ బంతాట చాలా శ్రద్ధగా ప్రాక్టీసు చేస్తారు. ఆ మధ్య ఎక్కడో సోకర్ మాచెస్ జరిగాయి.వాటిని టి.వి.లో ప్రసారం చేశారు. అప్పుడు చెప్తే నమ్మరు, కొన్ని లక్షల టి.వీ.లు బెంగాల్‌లో అమ్ముడు పోయాయి. ఆ ఆట అంటే వాళ్ళకంత ప్రీతి.

శిబో కూడా చాలాకాలం, అంటే తన చిన్నతనం బర్నపూర్‌లోనే గడిపాడు. వాడి తల్లి పేరు మీరా. ఆమె పెద్దవాళ్ళ ఇళ్ళల్లో పనిచేస్తూ వుండేది. శిబోకి చదువు అబ్బలేదని అనలేం. బడిలో చేరిస్తే చాలా బాగా చదివేవాడు. కాని మీరా, ఆమె భర్త కొడుకును చదివించుకోలేకపోయారు. వాడు కూడా తల్లి వెనకాలే పనిచేస్తూ, ఇంజనీర్ల పిల్లల్ని

ఆడిస్తూ, వారు కాన్వెంటులో నేర్పిన పలుకులు వారికిమల్లే మాట్లాడుతూ, వాళ్ళ వెనకే మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతూ వుండేవాడు- అప్పుడు వాడివి ఎవరూ ఆడనిచ్చేవాళ్ళు కారు. వాడే కోచ్ వెనక వుండి, అతనికి బంతి అందించినట్టు గ్రౌండ్‌లో మార్కింగ్ చేసినట్టు బాయ్ తెచ్చినట్టు వెట్టి పనులు చేస్తూ వుండేవాడు. క్రమంగా వాడు పన్నెండో ఏడయేసరికి ఆటలో చాలా మెలకువలు నేర్చుకున్నాడు. రమారమి అయిదు సంవత్సరాలు శైలేంద్ర దగ్గర పరోక్షమైన శిక్షణ పొందినవాడన్న మాట.

శిబో తన పన్నెండో ఏటే కలకత్తా వెళ్ళిపోయాడు. వాళ్ళ నాన్నకు అక్కడ నౌకిరీ దొరికింది. అక్కడ నుంచి వాడి జీవితం మారిపోయింది. వాడిలోని గొప్పతనాన్ని అక్కడివాళ్ళు గుర్తించారు. అలా అలా వాడు పెద్దవాడయి పేపర్లకెక్కాడు. శివకుమార్ ముజుందారుగా మారాడు. వాడు- అతనుగా మారాడు.

శిబో సహజంగా వినయం కలవాడు-ఇప్పటికీ శైలేంద్రని గురూజీ పేరు తలవంది ఆటకు దిగడు. చాలా మాచ్‌లలో ఆడాడు. సెంటర్ హాఫ్‌గా




అద్భుతంగా ఆడతాడు.

'బర్నపూర్ బ్లాస్' జట్టుతో గురూజీ వచ్చిన సంగతి తెలిసింది. ఒకసారి నమస్కారం చేసి ఆశీర్వాదం పొంది వెళ్ళిపోదామనుకున్నాడు.

కాని, చాలాసేపటి వరకు శైలేంద్ర గుర్తించలేకపోయాడు శిబోని-

"గురూజీ ప్రతి ఉదయం అయిదు గంటలకి ముందు నేను, తరువాత మీరు మైదానానికి రావడం, నేను మీకు చాయ్ తెచ్చియివ్వడం, గ్రౌండ్ చుట్టూ పరుగెత్తడం, ఏ విధంగా బంతి తన్నాలో, ఎలా ఆపాలో మీరు చెప్తుంటే, ఆటగాళ్ళ పక్కన నిలబడి నేను వినడం మరిచిపోయారా! మీరా కొడుకు శిబో మీకు తెలీదా?"

"ఓరిపిడుగా! ఎంతవాడి వయావురా! ఏం ఇలా వచ్చావు?"

చేతిలోని పూలగుచ్ఛం గురువుగారి చేతిలో పెట్టి శిబో నిలుచున్నాడు. సేఠ్ ముఖంలోకి చూస్తూ అన్నాడు:

"గురూజీ! మీరేదో ఆందోళన పడుతున్నారు"

"శిబో! ఆందోళన కాక మరేమిటి! నీకు తెలుసుకదా! మనవూరి టీమ్ రేపు ఆడుతున్నారు. ఇంతవరకు నెగ్గుకొచ్చాం. రేపు గెలిస్తే ఫైనల్లో గెలుపు మనదే."

"గురూజీ! తప్పకుండా గెలుస్తారు మనవాళ్ళు. మీకు సందేహం దేనికి?"

"అదే! నాకింత వరకూ ఎటువంటి సందేహం కలగలేదు. కాని, ఒక అరగంట కిందే సంగతొకటి తెలిసింది. నార్త్ బెంగాల్ వాళ్ళు ఈమధ్యనే కొత్త



వాడినొకడ్ని తెచ్చుకున్నారట. వాడు చాలా బాగా ఆడతాడని విన్నాను. వాడి అంతే నాకు నిక్కడం లేదు. మన వాళ్ళకు ఎంత మారిపోసినా ధైర్యంగా వుండలేకపోతున్నారు."

శిబో అతని కళ్ళల్లోకి చూశాడు. శైలేంద్ర నిజంగా మతిదప్పినవాడిలా కనిపించాడు.

"ఏదేనా ఒక్క ఉపాయం, ఆ ముజుందారిని గెలిచే మార్గం చెప్పరా శిబో! మన ఆటగాళ్ళు నా మీద భరోసాతో ఇంత వరకు నెగ్గుకొచ్చారు. ఈ ముజుందారుగాడు లేకపోతే తప్పకుండా గెలుస్తారు."

శిబో ఆలోచిస్తున్నాడు.

"ఈసారి ఓడిపోయినా, మనవాళ్ళు మరోసారి గెలవచ్చు. కాని, కోచ్‌గా నా పేరు మంటగలుస్తుంది."

నిజంగానే గురూజీ కన్నీళ్ళు కారుస్తున్నాడు.

"గురూజీ! మీరీవిధంగా బాధపడుతుంటే నాకు కష్టంగా వుంది"

"నువ్వేం చేయగలవ్?" పేలవంగా నవ్వాడు శైలేంద్ర.

"నాకు చేతనయింది..."

"అయితే ఈ ఆట ఎలా గెలవడమో చెప్పు!"

"వినండి! మీ టీమ్‌లో భీమ్‌నందన్ సిన్హా వున్నాడు. ఆరడుగులు పొడవు, కింగ్ కాంగ్ లాంటి మనిషి- బంతిని తన్నకుండా ఎదుటి జట్టు ఆటగాళ్ళను తన్నడంలో చాలా పేరు పొందాడు. వాడిని ముజుందార్‌తో తలపడమనండి!"

"చాలా నిక్కచ్చిగా చెప్తున్నావే!"

"అవును! ఇదొక్కటే దారి! మీరు దేనికీ దిగులుపడకండి. ఆ ముజుందార్ కూడా మీ శిష్యుడే."

సేన్ ఆశ్చర్యానికి అంతులేదు. వాడు కూడా తన శిష్యుడే!

"అయితే వాడితో శిబో చెప్తావా? నేను వాడి గురువునని చెప్పు. గురువుకి అన్యాయం చెయ్యొద్దను."

## పూలు

మన దేశంలో గులాబీలను సౌందర్యానికి ప్రతీకలుగా భావిస్తారు. కానీ, చైనా, యూరప్ దేశాలలో గులాబీ, లిల్లీ పూలను సంతాపాన్ని ప్రకటించే సాధనాలుగా పరిగణిస్తారు.

బ్రెజిల్‌లో వంకాయ రంగుపూలను కేవలం శవాలంకరణకే ఉపయోగిస్తారు.

ఫ్రాన్స్‌లో నీలిరంగు పూలను అనారోగ్యంతో వున్నవారికి ఇస్తారు.

రష్యాలో ఎవరికైనా మహిళపై కోపముంటే నీలి రంగు పూలిస్తారు.

—రమ

శిబో మరేం జవాబు చెప్పలేదు. మరోసారి గురూజీకి పాదాభివందనం చేసి క్లబ్ నుంచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి శిబో చాలాసేపటివరకు నిద్రపోలేదు. ఏదో చిన్న ఆటగాడి నుంచి, ప్రఖ్యాతిచెందిన వాడుగా ముందుకొచ్చాడు. మరో ఆరు నెలల్లో విదేశాలలో ఆడడానికి వెళ్తున్నాడు. బీదరికం నుంచి ఇప్పుడే తేరుకుంటున్నాడు. పేరు ప్రఖ్యాతులే కాక ఈ ఆట ఎన్నో విధాలుగా తనకు సహాయం చేస్తున్నది. మర్నాడు మాచ్ గెలవడంలో సందేహం లేదు.

ఏం చేయడం?

కోచ్ ముఖం కళ్ళ ముందు నిలిచింది. ఆ గురువు అధికారుల పిల్లలకు కిటుకులు చెప్తుంటే తనూ విన్నాడు. తనకేవీ ప్రత్యేకంగా అతను చెప్పలేదు.

ఏదయినా అతనినే గురువుగా స్మరిస్తున్నాడు.

కాబట్టి లోకం తల్లక్రిందయినా గురువును సంతుష్టుడుగా చేయడమే ధర్మంగా తోచింది ముజుందార్‌కి.

** ** **

బర్నపూర్ బ్లూస్‌కి, నార్త్ బెంగాల్‌కి మరునాడు క్వార్టరు ఫైనల్స్ జరిగాయి. మొదటి సగంలో నలభై నిమిషాలలోను శివకుమార్ ముజుందార్ విజృంభించాడు. అతనికొక్కడికే భీమ్‌నందన్ సిన్హా దెబ్బల నుంచి తప్పించుకోవడం తెలుసు. మరొక్క అయిదు నిమిషాలలో మొదటి సగం ముగుస్తుంది.

అప్పటికే నార్త్ బెంగాల్ వాళ్ళ అంటే శివకుమార్ మూడు గోలులు చేశాడు. కోచ్ శైలేంద్రకి ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో తెలిసింది కాదు. శిబోగాడు తనని అన్యాయం చేస్తాడా?

గ్రౌండ్‌లో పెద్ద కలకలం- భీమ్‌నందన్ సిన్హా చాలా బలంగా ముజుందార్ తొడమీద ఎగిరి తన్నాడు. అతను తప్పించుకోలేదు. ప్రేక్షకులు విరుచుకుపడ్డారు. పోలీసులొచ్చారు. ముజుందార్‌ని హాస్పిటల్‌కి తీసుకుపోయారు. సిన్హాని డిబార్ చేశారు.

రెండవ సగంలో బర్నపూర్ బ్లూస్ నాలుగు గోలులు చేసి గెలిచారు.

ఇప్పుడు ముజుందార్ శిబో ఫుట్‌బాల్ ఆట ఆడలేదు. ఒక కాలు విరిగిపోయింది. క్రరకాలుతో నడుస్తాడు.

కాని అభిమానులతనికి కోచ్ ఉద్యోగమిప్పించి, ఏ లోపం లేకుండా చూశారు.

ఎవరో శిష్యులు ఒకసారి ఆట గెలిచి అతని పాదాలకి దండంపెట్టి అన్నారు:

"గురూజీ! మీరు ద్రోణాచార్యుల వంటివారు! మేము ఏకలవ్యులం."

శిబో చాలా సీరియస్‌గా అన్నాడు:

"మీరు ఏకలవ్యులు కావచ్చు! కాని నేను ద్రోణాచార్యుడిని కాను- నా శిష్యులు నన్ను మించాలని కోరుకుంటాను. వారిని కోరి నాశనం చేయడం నా ధ్యేయం కాదు." ●

